1 APR 2019

## వెంకన్న ఆలయం నిర్మాణంపై స్టే

యానాం, న్యూస్‌టుడే: యానాంలో మీసాల వెంకన్న ఆలయం నిర్మాణం కొనసాగించకుండా యథాతథస్థితిని కొనసాగించాలని మద్రాస్ హైకోర్టు స్టే విధించినట్లు సుంకర స్వామినాయుడు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర కార్తీక్ తెలిపారు. శతాబ్దాల చరిత్ర ఉన్న ఆలయం పునర్నిర్మాణాన్ని సవాల్ చేస్తూ న్యాయస్థానంలో మార్చి 28న వ్యాజ్యాన్ని దాఖలు చేయగా, గుడిని యథాతథ స్థితిలో ఉంచి ఏప్రిల్ 11లోగా ప్రభుత్వ అధికారులు వివరణ ఇవ్వాలని న్యాయంస్థానం ఆదేశించిందన్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్, పర్యాటక శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వాలని కోర్టు ఆదేశించినట్లు సుంకర తెలిపారు. భక్తుల కోరిక మేరకు ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తామని సుంకర కార్తీక్, ధూళిపూడి మాధవ వెంకన్న, కూనపురెడ్డి సతీష్, మండపాక సత్తిబాబు, కోన వెంకటరత్నం, ఆదిమూలం శ్రీను, బెజవాడ రామకృష్ణ తెలిపారు.

## 6న నవోదయ ప్రవేశ పరీక్ష

**మెట్టకూరు (యానాం):** జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష జరగనుందని ప్రిన్సిపల్ ఎం.అనురాధ తెలిపారు. ప్రవేశపరీక్ష రాసేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థులు తమ హాల్‌టిక్కెట్ల కోసం ఎంపిక చేసిన కంప్యూటర్ కేంద్రాలను సంప్రదించాలన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసినవారు హాల్ టిక్కెట్ల కోసం నవోదయ కార్యాలయానికి రావాలన్నారు. హాల్‌టిక్కెట్‌లో తప్పులుంటే నిర్ణీత పత్రాలతో తమ కార్యాలయానికి రావాలని, సందేహాలు నివృత్తి, సహాయం కోసం సంప్రదించాలన్నారు.

1 APR 2019

## వెబ్‌కాస్టింగ్‌పై నేటి నుంచి శిక్షణ

**యానాం:** పుదుచ్చేరి పార్లమెంటరీ స్థానానికి ఏప్రిల్ 18న జరిగే ఎన్నికల పోలింగ్ ప్రక్రియను రికార్డ్ చేయడానికి 40 మంది విద్యార్థులకు సోమవారం శిక్షణ ఇవ్వడానికి ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి శివరాజ్‌మీనా తెలిపారు. స్థానిక డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు సర్వశిక్షాభియాన్ సమావేశ మందిరంలో శిక్షణ ఇవ్వడానికి ముగ్గురు అధికారులు పుదుచ్చేరి నుంచి వచ్చారన్నారు. రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాలు, సభలను చిత్రీకరించే బృందాలకు, సెక్టార్ అధికార్లకు మంగళవారం శిక్షణ ఉంటుందన్నారు. యానాంలో 36 పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం, పుదుచ్చేరి ఎన్నికల కేంద్రం, కేంద్ర ఎన్నికల కమిషన్ వెబ్ కెమెరాల ద్వారా అన్ని అంశాల్ని చూడవచ్చన్నారు. ఇటీవల దరఖాస్తు చేసుకున్న ఓటర్లతో కలిపి యానాంలో ఓటర్ల సంఖ్య 36,553కి పెరిగిందన్నారు. యానాంలోని ఒక పోలింగ్ కేంద్రంలో వీవీ ప్యాట్ యంత్రంలో ఓట్ల లెక్కింపునకు అనుమతి లభించింది.

1 APR 2019

## 6న నవోదయ ప్రవేశ పరీక్ష

మెట్టకూరు (యానాం), మార్చి 31: మెట్టకూరులో గల జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 6వ తేదీన పరీక్ష నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఎం.అనురాధ తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్ టిక్కెట్‌లను కంప్యూటర్ సెంటర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నేరుగా మెట్టకూరులో గల జవహర్ నవోదయ విద్యాలయంలో సంప్రదించాలని కోరారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌లో తప్పులుంటే సరియైన ఆధారాలతో జవహర్ నవోదయ విద్యాలయంలో సంప్రదించాలన్నారు. పరీక్షకు సంబంధించిన వివరాలకు హెల్ప్ డెస్క్ నంబర్లు 9490655706, 9542191932, 9000599220లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించాలన్నారు.

1 APR 2019

## వేసవిలో త్రాగునీరు సమస్య రాకుండా చర్యలు: డిప్యూటీ కలెక్టర్

యానం, పెన్‌పవర్

నియోజకవర్గంలో ఎటువంటి త్రాగునీరు ,సాగునీరు సమస్యలు రాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని డిప్యూటీ కలెక్టర్ శివరాజ్ మీనా సంబంధిత అధికారులకు ఆదేశించారు .ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి దరియాలచెప్పా ,తీర ప్రాంత గ్రామాల కు సంబంధించి నీరు వెళ్లే కాలువలను పరిశీలించారు .ఈ ప్రాంతాలలో వేసవిలో ఎటువంటి నీటి ఎద్దడి రాకుండా చర్యలు చేపట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు .వేసవిలో చెరువులను నీటితో నింపే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు .ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చందర్రావు సంబంధిత అధికారులు పాల్గొన్నారు..



1 APR 2019

## స్మార్ట్‌సిటీ రన్‌లో యానాం విద్యార్థుల ప్రతిభ

యానాం: కాకినాడ రన్నర్స్ టాలెంట్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడలో నిర్వహించిన స్మార్ట్‌సిటీ రన్‌లో యానాం విద్యార్థులు ప్రతిభ కనబరిచారని యానాం అమెచ్యూర్ అథ్లెటిక్ అసోషియేషన్ కార్యదర్శి చింతా వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-18లో బాలుర విభాగంలో 5 కిలోమీటర్ల పరుగులో గండి శత్రుఘ్నుడు బంగారు పతకాన్ని రూ.3 వేలు నగదు బహుమతిని, గండి భరతుడు కాంస్య పతకాన్ని, వెయ్యిరూపాయల నగదు బహుమతిని సాధించారని తెలిపారు. బత్తిన నీలిమ అండర్-18 బాలికల విభాగంలో వెండిపతకంతో పాటు వెయ్యిరూపాయల నగదును, అండర్-16 బాలుర విభాగంలో రెయ్యా మోజెస్, తెల్లాకుల వెంకట్‌లు బంగారు, వెండిపతకాల్ని సాధించారని తెలిపారు. వీరికి కోచ్‌గా పబ్బినీడి శేఖర్ వ్యవహరించారని, అసోషియేషన్ అధ్యక్షులు కాపగంటి శేషసుమన్ విద్యార్థులకు రవాణాచార్జీలు చెల్లించారని తెలిపారు.

## వెంకన్న ఆలయ పునర్నిర్మాణంపై స్టేటస్ కో

యానాం: యానాంలో వేంచేసియున్న భూసమేత వేంకటేశ్వరస్వామి(మీసాలవెంకన్న)వారి ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించి మద్రాసు హైకోర్టు స్టేటస్ కో జారీ చేసిందని పిటిషన్‌దారుడు సుంకర కార్తీక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తుల మనోభావాలకు వ్యతిరేకంగా, వ్యక్తిగత స్వార్థంతో శతాబ్దాల చరిత్రకలిగిన పురాతన ఆలయాన్ని కూల్చివేసి ఆలయం పునర్నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి మూలవిరాట్‌ను సైతం తీసివేశారని ఈ నేపథ్యంలో దీనికి వ్యతిరేకంగా తాను మద్రాసు హైకోర్టు ఆశ్రయించానని ఆయన తెలిపారు. దీనిపై స్పందించిన కోర్టు స్టేటస్‌కో ఇచ్చిందని దేవాలయాన్ని యథాస్థితిలో ఉంచాలని మార్చి 28న హిందూ రిలీజియస్ ఇనిస్టిట్యూషన్స్ (హెచ్ ఆర్‌ఐ)కు ఆదేశాలు జారీచేసిందని ఏప్రిల్ 11లోగా ప్రభుత్వ అధికారులను వివరణ ఇవ్వాలని అఫిడవిట్ దాఖలు చేయాలని, అదేవిధంగా దేవస్థానం కమిటీ చైర్మన్‌కు, మంత్రి మల్లాడి కృష్ణారావుకు సైతం ప్రైవేట్ నోటీసులు జారీచేయాలని ఆదేశాలు జారీచేసిందని తెలిపారు. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు దేవాలయాన్ని యథాస్థితిలో ఉంచాలని తెలిపారన్నారు. భక్తుల కోరిక మేరకు త్వరలో మూలవిరాట్‌ను సైతం యథాస్థితిలో ఉంచి పూర్వవైభవానికి కృషి చేయనున్నట్లు నాయకులు ధూళిపూడి మాధవ వెంకన్న, కూనంరెడ్డి సతీష్, మందపాక సత్తిబాబు, కోన వెంకటరత్నం, ఆదిమూలం శ్రీను, బెజవాడ రామకృష్ణ తదితరులు తెలిపారు.